# లాలా లలనామణి

శ్రీమతి ఆదిపూడి వసుంధరాదేవి గారు, బి. ఏ.

[సచిత్రము: చిత్రకారుడు:— శ్రీ నరదా వెంకటరత్నం గారు]

సింధు దేశపు పాదుషాయైన అహమ్మదుషా గ్రీష్మ భానుని ప్రతాపమున కోర్వలేక రజతకాసార తీరముననున్న చలువరాతి భవనమునకు వచ్చి విందు లారగించుచు విశ్రాంతిని బడయుచుండెను. అతఁడు యువకుఁడును, మహాబలశాలియు, శౌర్యవంతుఁడును నైయుండుటయే కాక, రణరంగమునఁ జూపిన శౌర్యప్రతాపములకును, కవనమునకును, విచిత్రకళాపోషణమునకును గూడ మిగుల ప్రఖ్యాతి గాంచియుండెను. అతఁడొక వెన్నెలనాఁటి రాత్రి తనమిత్రబృందముతోఁ గూడి వివిధాలంకృతమైన తెప్పలోఁ గూర్చుండి యా రజతకాసారమునందలి వృక్షద్వీపముల చుట్టును తిరుగుచుఁ దనవందిమాగధులు పాడు పాటలను, ఆలపించు రాగములను విని యానందించుచుండెను. అప్పు డాపాదుషా ఇహలోక సౌఖ్యశిఖరమున నాసీనుఁడైనట్లు తలఁచుచుండెను. మహామ్మదీయ గాయకులు అతని విజయములను గురించియు, అతనికై స్వర్గమున వేచియున్న యప్సరసాంగనల గురించియు, భరతపక్షికిని గులాబిపువ్వునకును గల ప్రేమానుబంధమును గురించియు, వివిధగతులగాన మొనర్చుచుండిరి. ఆతరుణమం దొక హిందూస్తోత్రపాఠకుఁడు ఆఁడు లేడికన్నులను మించు నేత్రములు కలదియు, రాముని సహధర్మచారిణియు నగు సీతాదేవి కెనయగునెమ్మదిని, తెలివిని, సౌందర్యమును కలదియునగు నొక రాజపుత్రిని వర్ణించుచు నెలుగెత్తి పాడ మొదలిడెను. ఇంద్రజాలమునంటి యాపద్యధారను హిందూదేశపు శిశికళల క్రిందవిన్నప్పుడు ఆపద్యరత్నములలో వర్ణింపఁబడిన యాసౌందర్యవతియందు ఆపాదుషా హృదయమున ననురాగాంకురములు మొలకలెత్తెను. “ఈ స్త్రీశిరోమణి ఈవనితారత్నము, ఎప్పుడీ భూమిన లంకరించి పావనము చేసెను? ఏ హిందువు, ఏ విగ్రహారాధకుఁడు ఆమెను చేపట్టెను?” అని అత్యాతురతతో పాదుషా యాగాయక శిఖామణి నడిగెను. “ఆమె యిప్పుడు జీవించియున్నది. ఆమెకింకను వివాహము కాలేదు. ఈ సౌందర్యవతి రాజపుత్రప్రముఖుఁడైన పర్వతసింగుని పుత్రికామణి యగు ‘లాలా’ లలనా తిలక”మని గాయకుఁడు మనవి చేసెను. ఆమె నీవు వర్ణించినంత సుందరియే యైన నా భార్య కాక తప్పదు. లేనియెడల నీ యతిశయోక్తులకు నీ శిరము నుధార పోయవలసియుండును.”



అప్పు డాపాదుషా ఇహలోక సౌఖ్యశిఖరమున నాసీనుఁడైనట్లు తలఁచుచుండెను.

అనిచెప్పి పాదుషా కొంచెము దీర్ఘాలోచనచేసి, తనపడవను చలువరాతిరేవునకుఁదీసికొనిపోయిదింపుఁడని భటుల కాజ్ఞాపించెను. మరునాడు అహమ్మదుషా తనబ్రాహ్మణ సచివునకు కబురుపంపి, రప్పించి పర్వతసింగు కుమార్తెను గురించిప్రస్తావించెను. అప్పుడాబ్రాహ్మణుఁడుపద్యముల మించిన యనర్గళ వచనరచనలోనే యా యువతీమణి రూపగుణములనువర్ణించి, రాకాచంద్రప్రకాశితంబైన రజత కాసారముమీఁద బఠితములైన పద్యములు నిజములని రుజువుపఱచెను. రాగరసపూరితమైన తనమనస్సున కీ వర్ణన సోఁకినతోడనే పాదుషాఆయువతీమణిని పాణిగ్రహణము చేసికొనుట తనయభిమతమని పర్వతసింగునకుఁ దెలియఁజేయనాబ్రాహ్మణున కాజ్ఞాపించెను. కాని ఆతని స్నేహప్రవాహము నిశ్చలముగా, నిర్మలముగాఁ బ్రవహించుటకాతఁడు నోచుకొనలేదు. ఎందఱో రాజపుత్రులు తమపుత్రికలను మహమ్మదీయులకిచ్చి వారిని రాణివాసమునఁజేర్చుచుండిరి. పర్వతసింగన్ననో రాజపుత్రుల రాజపుత్రుఁడు. తన అకళంకజీవనమును దానివలనఁగలుగు గౌరవమును జూచి యుప్పొంగుచుండెను. రాజాధిరాజుతో రాజ్యము ననుభవించుట తటస్థించినను తన కొమార్తె మహమ్మదీయునిఁ బెండ్లిచేసికొని కులమును బోఁగొట్టుకొనుట యనుచితమని యెంచుచు, అట్టితలంపు నేదూషించుచు, పర్వతసింగతిగర్వముతో విహరించుచుండెను. అయినను తనప్రయత్నములు నెఱవేరుటకుఁగాను చక్రవర్తియాజ్ఞకు బద్ధుఁడైనట్లు నటించుచుండెను. ఈసంపర్కమునఁ 'దన్నుఁదనకొమార్తెను అగౌరవమునుండి కాపాడవలె'నని అడుగుటకుగాను బంధువులను సామంత రాజులను బిలువనంపి ఆలోచనల జరుపుచుండెను.

అహమ్మదుషా తనచెవికి రాజపుత్రుల ప్రయత్నములగాలి సోఁకినవెంటనే, సమయముమాచి దుర్గమును ముట్టడించుటకో, లేక రాజపుత్రికి రక్షకభట సైన్యముగా నుండుటకో, అనుకూలించునని తానును బదివేల సైన్యమును ప్రోగుచేసెను. రజతాసనముచే నలంకరింపబడిన పట్టపుఁటేనుఁగునెక్కి లాలాదేవిని గొనివచ్చుటకుఁగాను వివిధభూషణాలంకృతంబగు మఱియొక గంధసింధురమును వెంటనిడుకొని అహమ్మదుషా సైన్యమును సొంతముగా నడుపుచు అహోరుపుర మార్గమునుబట్టి బయలుదేరెను.

ఈరీతి నహమ్మదుషా తన బలముల వెంటనిడికొని అహోరు పురద్వారమును సమీపించి 'కవాటములఁ దెరువు'డని బెదరించెను. ఆబెదరింపులకును, ఆజ్ఞలకును రాజపుత్రులా బెదరువారు! ఘోరనారాచములనుఁ బ్రత్యుత్తరముగానిపుణతతోఁ బ్రయోగింపనారంభించిరి. ఆబాణములు వాయువేగమునవచ్చి అంబారీశిఖరమును దాఁకఁ జొచ్చెను. "పర్వతసింహపుత్రికను వివాహమాడఁదలఁచికొనిన యోమ్లేచ్ఛరాజా, ఇఁక రాఁబోవు శరము నీకిరీటమునేకాక నీశిరమునే ఛేదించును. కీడుమూడకముందే ఈ తావునువిడిచి ప్రాణములఁ గాచికొమ్ము, పొమ్ము" అను నీవాక్యములుగల ఒకయుత్తరముతోఁగూడిన వాఁడి బాణమొకటి ఆపాదుషాకెదుట వచ్చిపడెను. అహమ్మదుషా పెండ్లికొమార్తకుఁ బంపినదుస్తులును మూటగట్టి గోడమీఁదనుండి క్రిందికిఁ బడవేయఁబడెను. అవియు ఘాటీల్లో దొర్లి దొర్లి ఆపాదుషా ఆసీనుఁడైయున్న హస్తిహస్తముముందు వచ్చిపడెను. ఈవిధముగా రాజపుత్రులు శస్త్రప్రయోగముచేతను, అగౌరవముచేతను, యుద్ధమును బ్రకటించిరి. మహమ్మదీయులు గోరుముట్టుమీఁది రోఁకటిపోటువలె అగౌరవముతో పాటు ప్రాణాపాయముగూడ కలుగు ననుభయముచే రాజపుత్రుల శరవర్షమున కాఁగఁజాలక భీతిల్లి పరువెత్తఁజొచ్చిరి. అహమ్మదుషా వలపంతయు నిప్పుడు అఖండమైనముట్టడి రూపమును దాల్చెను. అహోరుదుర్గమును మూఁడువేల రక్షకభటులు కాపాడుచుండిరి. పెండ్లికొమార్తెను ఆమె తండ్రిని వలలో వేసికొనుటకై పాదుషా పంపిన అమూల్యములైన కానుకలును ధనమును రాజపుత్రులు దుర్గరక్షణమునకును, మంచి ఆయుధములు గొనుటకును వెచ్చించిరి. వైరులు ప్రాకారమును సమీపించుటయే తడవుగా రాజపుత్రులు వారిని శరపరంపర కెఱచేయుచుండిరి. బురుజులమీఁద ప్రోగుచేసిన పెద్దపెద్దరాళ్లను వారిమీఁద వర్షముగాఁ గురిపించుచుండిరి. తురుష్కులు కోటమీఁది కెక్కుచుండఁగా నిచ్చెనల లాగుకొని వారిని బడవైచుచుండిరి. ఇవ్విధముగా రాజపుత్రులు మ్లేచ్ఛసైన్యమును యమసదనమున కనుపుచుండిరి. కోటను స్వాధీనము చేసుకొనుటకుఁ దురుష్కులు చేసిన ప్రయత్నములన్నియు విఫలములయ్యెను. అప్పుడు శత్రువులు కోట

యభేద్యమని యెంచి ఆప్రయత్నమును వదలి పురమును జుట్టు ముట్టడించిరి.

రెండుమూఁడు మాసములు గడచెను. నగరులోని వస్తువులన్నియు ముగియఁజొచ్చెను. వెలుపలనుండి సహాయమువచ్చునన్నమాట కలలోని వార్త అయ్యెను. పురమిప్పుడో యప్పుడో శత్రువులకు లోఁబడునట్లు తోఁచుచుండెను. పర్వతసింహు తనకొమార్తెను పాదుషాకిచ్చుటకు నప్పుడైన నొడంబడి సంధిచేసికొని యుండినయెడల సంధినియమములు అనుకూలముగానే యుండియుండును. పర్వతసింహు తన పుత్రికారత్నము నిచ్చుటకుమాత్ర మొప్పుకొనలేదు. అదిలేనిది సంధియే పొసఁగనేరదు.

రాజపుత్రులు మానమును గాపాడుకొనుటకై ప్రాణములనైన నర్పింప సంసిద్ధులైయుండిరి. వారు రణరంగమున హతులైనయెడల వారిభార్యలును పుత్రికలును మహమ్మదీయుల రాణివాసము పాలపడుదురు. ఈకళంకమునుండి తప్పించుకొనుటకు జోహారను ఘోరకార్యమును జేయుటతప్ప మఱేయుపాయమును వారికి గానరాదయ్యెను. జోహారొనర్చుట యనఁగా స్త్రీలును పిల్లలును నిప్పులో దుముకవలెను. తరువాత వీరులు చావునకు వెరువక శత్రుసైన్యముపైఁబడి ప్రాణములకుఁ దెగించి పోరవలయును.

రాజపుత్రవనితలందరును ఉత్సాహపూర్వకముగా నీవిషాదకార్యము నెరవేర్పఁదమయిష్టమును బ్రకటించిరి. కొందరు ప్రాణప్రీతిచే నవమానమును సహింపనుండినను తమ నీచపుఁదలంపును బయట పెట్టినయెడల నందఱు నిందింతురనుతలంపుతో నూరకుండిరి. మఱికొందఱు తమ భర్తలతోను భ్రాతలతోను గలసి సంగరరంగమునఁ బోరాడ సమకట్టి పెద్దలయనుమతినిబడసి యుద్ధసన్నద్ధులై యుండిరి.

పర్వతసింగుభార్య మాత్రము కొంచెమైనను వెనుదీయక, భయమును, విచారమును నొక్కిపెట్టి "తానును తనతోడి స్త్రీలును గలిసి చిచ్చులోనుఱికి తమబంధువులమిత్రులును స్వర్గమునందుఁ గలుసుకొఁగల"మని ధైర్యముతోను,నిశ్చలభావముతోను భర్తతో విన్నవించెను. ఆరాత్రియే పెద్దచితిని బేర్చి రగులఁబెట్టిరి. అందు మొట్టమొదట వీతిహోత్రునకుఁ బ్రీతిగాఁదమతమనగలనన్నిటిని బాఱవైచిరి. తరువాత స్త్రీలందఱును బెద్దయనక, చిన్నయనక, బిడ్డలను జంకఁబెట్టుకొని కోటయందు ఆఁడుపురుగుగూడ లేకుండునట్లు మంటలోఁబడి అగ్నిదేవుని కాహుతి యైరి.

ఇప్పటి కాఁడువారిపని తీరిపోయినది. ఇఁకఁజేయవలసినపనియంతయు మగవారిదే. వారికిని శత్రుఖడ్గధారకెఱయై ప్రాణములనుగోల్పోవుసమయము వచ్చినది. తమప్రార్థనలను, పూజలను విధ్యుక్తముగాజరిపి తమతలపాగలలోఁ దులసికొమ్మలనుదోఁపి, సాలగ్రామములను మెడలోఁగట్టికొని, స్వర్గనివాసులగునప్సరసల చిత్రములను జెక్కినకిరీటములధరించి యుద్ధసన్నద్ధులై నిలువఁబడిరి. ప్రాతఃకాలమున మూఁడువేల రాజపుత్రవీరులు పీతాంబరములధరించి, మరలకలసికొనుట కల్లయనితలంచి విచారముతో అన్యోన్యాలింగనమొనర్చుకొనిరి. అప్పుడే దినకరుఁడు తనసహస్ర కిరణములచే నిశనిజెండాడి ఉదయాద్రిపైఁ బొడగట్టుచుండెను. హిందూవీరులును కోటగుమ్మములను దెఱచి ముట్టడించిన శత్రుసైన్యముపై నొక్కుమ్మడిని బడిరి.

మహమ్మదీయుల గుడారముపైఁ బచ్చని జెండా మెఱయుచుండెను. పర్వతసింగును, ఆతనికుమార రత్నమగు రామసింగును సేనాధిపతులుగా నుండి తమసైన్యమును శత్రుమధ్యముననున్న పాదుషా పట్టుగుడారముపైఁ బురికొల్పిరి. మరణసమయమున దుఃఖము ననుభవించుటకునందరు సమానులేయని తెలుపుటకుఁ బర్వతసింగును, రామసింగునుగూడ సైనికులతోఁ గలసి నడచుచుండిరి. కాని పర్వతసింగు రాజనితెలియుటకు రాజచిహ్నమగు ఛత్రము నాతని శిరముపైఁ బట్టియుండిరి. ఛత్రముమీఁద రాజపుత్రచిహ్నములును, వంశపారంపర్యమును దెలుపు సూర్యచంద్రబింబములును చిత్రముగాఁ జిత్రింపఁబడియుండినవి. ఛత్రము శత్రువులకంటను రాజుపైపున కాకర్షించుటచే గొడుగుపట్టుట కూడఁ బ్రమాదకరముగనుండెను. కాని దీనికై చింతయేల? అందఱును చావునకు దృఢనిశ్చయులైనవారే. స్వర్గము నలంకరించుట కొకగడియ వెనుకైననేమి; ముందైననేమి?

అడ్డుగవేసిన పెద్దగట్టొకటి మహమ్మదీయ సైన్యమును గాపాడుచుండెను. కాని ఈముట్టడిదిబ్బరాజపుత్రు

ల శేమిలక్ష్యము. ఈగట్టును నిరాయాసముగా తెగఁగొట్టి రాజపుత్రులు శత్రుసైన్యములోఁబడి పాదుషాయొక్క గుడారమువైపు చొరవచేసికొని పోవుచుండిరి. అహమ్మదుషా వడివడిగాఁ దనపట్టపుటేనుఁగునెక్కి యుద్ధమునకు సన్నద్ధుఁడయ్యెను. రాజపుత్రుల దెబ్బల కోడి తురుష్క సైన్యము పాదుషా చుట్టును చేరి యుద్ధము చేయుచుండెను. సైన్యము రణరంగమునకుఁ జేరుటకాలస్యమగుటచేఁ జాపుల చేతను, సింహ గర్జనముల చేతను దనవారిని బ్రోత్సాహ పరచుచు తానును రాజపుత్రులపైఁ గరకుటమ్ముల నేయుచు సాహసముతోఁ బోరాడుచున్న పాదుషాగారికిఁ బ్రాణాపాయసమయము తటస్థించెను. అతని రక్షకభట సైన్యము ముందువైపు అత్యంత సాహసముతోఁ బోరాడి నిహతమగుచుండెను. మరలఁ గ్రొత్త దండువచ్చి వారిస్థలము నాక్రమించుచుండెను. అయినను రాజపుత్రు లీకష్టములు లక్ష్యపెట్టక చొరవచేసికొని ముందుకు నడుచుచునే యుండిరి. తుట్టతుదకు వారు పాదుషా యెక్కియున్న యేనుఁగును సమీపించిరి. అతని అంబారీ అంతయు వీరు ప్రయోగించిన బాణములతోను కత్తులతోను నిండి యుండెను.

అప్పుడు రామసింగు చూపిన ధైర్యము రాజపుత్రులకు మరింత ప్రోత్సాహమును గల్గించెను. అతఁడు ఆ యేనుఁగు కడుపు క్రిందికి దూరి దానికిఁ గట్టిన త్రాళ్లను దన నిశితకరవాలముచేఁ ద్రుంచెను. అంబారీదొర్లి క్రిందఁ బడెను. దానితోపాటు అందున్న గర్వియగు పాదుషా కూడ దుమ్ములోఁ బడెను. ముందరనున్న ఒకరిద్దరు రాజపుత్రులును, రామసింగును జింకమీఁదఁ బడనుంకించు పులి పిల్లలవలెఁ బాదుషామీఁదఁ బడఁబోవుచుండిరి. పాదుషా తత్క్షణమే ఖడ్గహస్తుఁడై నిలఁబడి సైన్యము తన్నుఁగాపాడ వచ్చునంతకును నిపుణతతోఁ దన్నుఁ దాను రక్షించుకొనుచుండెను.

జయలక్ష్మి మొదట నిశ్చంచలయై యుండెను. కాని మహమ్మదీయ సైనికులు నానాదిక్కులనుండి పరువెత్తుకొనివచ్చి సంగరరంగమున నిలుచుటచే జయలక్ష్మికిఁ బక్షపాతము జనించెను. తమ మధ్యనుండుటచే మహమ్మదీయ సైన్యములు రాజపుత్రులను నలువైపుల ముట్టడింప సాగిరి. ఆసమయమున రాజపుత్రులు వలయాకారమున నిలఁబడి మీఁదమీఁదవచ్చు శత్రుసైన్యములఁ బరిమార్చుచుఁ దమ్ముఁదాము రక్షించుకొనుచుండిరి. ఇట్లుండఁ గొంతసేపటికి హతులైనవారి శరీరముల గుట్టలు తప్ప రాజపుత్రుల రక్షింపమరేమియుఁ గానరాదయ్యెను. రాజపుత్రులు శత్రువుల నెదురించుటకు మారు తమ్ముఁదాము కాపాడుకొనినఁజాలునను దుస్స్థితికి వచ్చిరి. తమసంఖ్య తగ్గిన కొలఁదిని వలయము చిన్నదగుచుండెను. వారి నిశితకృపాణములు కొన్ని మొద్దుపారిపోయెను. కొన్ని విరిగిపోయెను. విరామములేక సంగ్రామ మొనర్చుటచే వారి అవయవపటుత్వముకూడఁ దగ్గిపోవుచుండెను. అయినను, అప్పుడప్పుడు రాజపుత్రులు ప్రాణమునకుఁ దెగించి దట్టముగానున్న తురుష్క సైన్యముపైఁబడి తమచేతి కందినంతమంది శత్రువులను యమలోకమునకు సాగనంపి తామును మృత్యుదేవతె వాతఁబడుచుండిరి.

అప్పటికిని బర్వతసింగు రాజచిహ్నములును, శ్వేతచ్ఛత్రముచు, ఎగసిన ధూళిలోనుండియు, సైనికుల గుంపులోనుండియు మెఱయుచునే యుండెను. దానిని బడఁద్రోయుటకుఁ జేసిన మహమ్మదీయుల ప్రయత్నములన్నియు నిష్ఫలమయ్యెను. ఆ ఘోరసంగ్రామమునందుఁ బర్వతసింగుకూడ నతిధైర్యసాహసములతోఁ దన పూర్వులను మించి పోరాడిపోరాడి తుదకొకవాడితూపునకుఁ బాలై అత్యంతభక్తితో యుద్ధమొనర్చి పడిన సామంతరాజులతోఁ దానుగూడ నిహతుఁడై భూమిపైఁ బడెను. వెంటనే రామసింగు ఛత్రము క్రిందఁ దనస్థానమునుగైకొని తనవారిని బ్రోత్సాహపరచుచు స్వాతంత్ర్యమునకై యుద్ధముచేయ సంసిద్ధుఁడయ్యెను. ఆబాలరా రాజకుమారరత్నము తనఖడ్గము ముక్కలగుటచే అప్పుడే యుద్ధరంగమునఁ బ్రవేశించిన యొకతురుష్కుని చేతనున్న కత్తిని లాగుకొని దానిచే ముగ్గురు శత్రువీరుల యసువుల మాటికొని రాజచిహ్నములతోఁ గూడ దానును ధరణిపైఁ గూలెను. ఆమహాసంగ్రామ మంతటితో ముగిసిపోయెను. అయిదువేల వీరులు నేలపాలైరి. ఇంక "దీన్ దీన్" అను తురుష్కనినాదములు రాజపుత్రుల "హరహరమహాదేవ్" అనుశబ్దములచే ప్రతిధ్వనించుట లేదు. అహో! రాజపుత్ర శౌర్యమంతయు నంత


యుండెను. కాని తమకన్న నెక్కుడుమంది శత్రువులను హతమార్చిన పిమ్మటనే రాజపుత్రులు తమప్రాణములను గోల్పోయిరి.

తాను కష్టపడి సంపాదించికొనిన తనపెండ్లికొమార్తెను ఆనిరాధారమైన దుర్గమునుండి తీసికొనిపోవుటకు అహమ్మదుషా లోపలికిఁ బ్రవేశించెను. కాని యచట పీనుఁగుల ప్రోవులు తప్ప మరేమియుఁ గానరాదయ్యెను. ఆపట్టణమంతయు నిర్జనమైయుండెను. కోటకు లోపలనేమి, బైటనేమి, ఎటు చూచినను పీనుఁగులకుప్పలే. ఇంతవఱకును జేసినట్లే ఇప్పుడును రాజపుత్రులు తమధైర్యమును, సాహసమును బ్రకటించిరి. చచ్చినను రాజపుత్రులు మానము పోఁగొట్టుకొనువారు కారని ప్రపంచమునకు వెల్లడిచేసిరి. మగవారును, ఆఁడువారునుగూడ శౌర్యముతో వెనుకముందు చూడక వీరస్వర్గము నలంకరించిరి. మ్లేచ్ఛులకులోఁబడక స్వాతంత్ర్యమును సంపాదించుకొనుఁడని తమతరువాతి వారినిగూడ హెచ్చరించి కీర్తిశేషులైరి.

ఇట్లు తనవలపువలన గలిగిన దుఃఖఫలమునుజూచి కొంతసేపేమియుఁదోఁచక పాదుషా విచారసముద్రమున మునిఁగియుండెను. కానికొంతసేపటికొక దూతవచ్చి లాలాలలన ఆ అహోరుమంటలలో దగ్ధము కాలేదని చెప్పగానే అహమ్మదుషాకు విచారము పోయి ఆశాంకురములు జనించెను. శత్రువులు తనపట్టణమును ముట్టడివేయక ముందే పర్వతసింగు తనకు మిక్కిలి నమ్మకముగల ఒకసామంతరాజు నొద్దకు తనపుత్రికారత్నముగు లాలానుబంపి యుండెను. ఈ సంగతిని వినగానే అహమ్మదుషా తానువలచినయావనితను తనకప్పగించవలసినదని ఆ సామంతరాజున కాజ్ఞాపించెను. పర్వతసింగునకుఁ బ్రాణమిత్రుఁడైన ఆ సామంతరాజు ఆపిల్లను బాదుషా సాహసమునుండి కాపాడుటకుఁ బ్రాణములనైన నీయ నిశ్చయించుకొనియుండెను. కాని ఆలాలాలలనామణి తనదేశీయుల రక్తముచే భూమిని మరలఁ దడుపుట కియ్యకొనలేదు. "పాదుషా నన్ను వివాహమాడఁ గంకణము కట్టుకొని యున్నాఁడు. కనుక అతని కోరికయే నెఱవేరనిండు." అని ఆమె తన జాతివారితోఁ జెప్పెను. ఆమె పాదుషాను వివాహమాడుట కొప్పుకొనుటయే కాక పెండ్లికొడుకునకుఁ బాణిగ్రహణ సమయమున ధరించుటకై గొప్పగొప్ప జరీబట్టలను, నగలను బంపుటకుఁగూడఁ గృతనిశ్చయురాలైయుండెను. ఎవఁడు తనవంశమును, జాతిని నాశనముచేసెనో, ఎవనిచేతులు తనతండ్రియొక్కయు నన్నయొక్కయు రక్తముచే నెఱ్ఱవాఱెనో, అట్టివానిని ఆలాలాలలన వివాహమాడ నొప్పికొనినందులకై, ఆ నీచురాలిని రాజపుత్రులందఱును దూషింపసాగిరి.

రజత కాసారపు టొడ్డుననున్న పాదుషాగారి స్ఫటిక శిలా భవనమునందుఁ పెండ్లిజరుగుటకు నిశ్చయింపఁబడెను. ఇది రాజ వివాహమగుట చేతను, మతాంతర వివాహమగుటచేతను మిక్కిలి వైభవముతోఁ జరుగుటకుఁ దగిన ప్రయత్నములు గావింపఁబడు చుండెను. ఆ అహమ్మదుషాకూడఁ దన ఆశలన్నియు నెఱవేఱుననియు, హిందువులును మహమ్మదీయులును ఐకమత్యముతో మెలఁగఁగలరనియుఁ దానే ఏకఛత్రాధిపతియై దేశమునంతయుఁ బరిపాలింపఁగలననియుఁ గొండంత యాశతోనుండెను. తనఆశ నెఱవేఱుటకై తనతో విరోధులుగానున్న రాజపుత్రులనందఱును క్షమించి వారికొక క్షమార్పణాపత్రముఁగూడఁ బంపెను. హిందూ విధుల ప్రకారము పెండ్లి జరుగుటకు నిశ్చయింపఁబడెను. వేనవేలు బ్రాహ్మణుల కాశుభదినమున సంతర్పణచేయఁ దగిన ప్రయత్నములు జరుగుచుండెను. తన రాజ్యమునుండియు, ఇతర దేశములనుండియు గుంపులు గుంపులుగా జనులు వచ్చుచుండిరి. అందఱకునుగూడ రాజాతిథ్య మిచ్చుచుండెను.

ఇట్లు కోరికలన్నియు నెఱవేఱ, అత్యుత్కృష్ట దశయందున్న అహమ్మదు పాదుషానుజూచి తీరవలెను. ఇది ఆయన పెండ్లిదినము. అతఁడును, లాలాలలనామణి యునొక్కటే యాసనము నలంకరించియుండిరి. వారి మెడలయందుఁ గర్పూరహారములు వ్రేలాడుచుండెను, లావణ్యవతియగు నా పెండ్లికూఁతురు దివ్యాంబరాభరణభూషితయైయుండెను. పాదుషాయును దనభార్యచే నాఁటిప్రాతఃకాలమునఁబంపబడిన మేలిదుస్తులను ధరించియుండెను. వానియందుఁ గూర్పఁబడిన రత్నములు ధగధగ మెఱయుచుండెను. పూర్వాచారపరాయణులగు మహమ్మదీ



అహమ్మదుషా లాలా లలనామణిని బాణిగ్రహణమునఁ బరిగ్రహించెను.

యులు చీకాకుపడుచుండిరి. హిందూవిధ్యుక్త ప్రకారముఅహమ్మదుషాలాలాలలనామణిని బాణిగ్రహణమునఁ బరిగ్రహించెను.

ఈరీతిని పెండ్లితంతంతయు ముగిసినపిమ్మట లాలాలలన తనస్థలమునుండి మెల్లదిగా లేచి తనభర్త చేయిపట్టుకొని అతనిని సూర్యకాంతిలోనికిఁ దీసికొనివచ్చి "నాథా! మీరు కొంచెము వెలుపలికి దయచేసి మీరాజభక్తులకుం దుఃఖమును దర్శనమిచ్చి వారిని సంతోషపెట్టుఁడు" అని పలికెను.

పాదుషా వెలుపలికివచ్చి చూచునప్పటికి ప్రజలు చుట్టుప్రక్కలనంతను గుంపులుగుంపులుగాఁ గ్రిక్కిరిసియుండిరి. వారును అందమైన దుస్తులను ధరించియుండిరి. అతనిని జూచినతోడనే సంతోషముచే నుత్సాహంగి చప్పటలుకొట్ట నారంభించిరి. వీనినన్నిటిని జూచినప్పుడు పాదుషాయొక్క మనస్సులో సంతోషముపొంగి విరిసినదన్న నేమియాశ్చర్యము? ఆరజత కాసారము చుట్టును మనుష్యులే. ఎంతదూరముచూసినను తనదేశమే. ప్రతిపర్వతమును ప్రతిమైదానమును తనదే. తనదికాని ప్రదేశమే లేకుండెను. శత్రువుల నందఱను జంపి జయించితెచ్చిన తనరూపవతియగు భార్యనుజూచి పాదుషా మరింత యుత్సాహంగుచుండెను.

కాని ఆలాలాలలనామణి ఇప్పుడు తనభర్తనుఒక వింతచూపుతోఁ జూడఁదొడంగెను ఆమెచూపు లజ్జతోఁ గూడినయువతీమణిచూపు కాదు. ఇట్లు గంభీరముగా నాతని మొగముచూచి "నాథా! గమనింపుము. చాల గొప్పస్థితియందున్న మనుష్యులఁజూచి దేవతలోర్వఁ జాలరు. మనమన్ననో మంచి ఆరోగ్యస్థితియం దున్నారము. నిండు జవ్వనమునందున్నారము. అనురాగపూరితులమై యున్నారము. గనుక ఇవన్నియు, ఏదినములో ఏగడియలో నంతరించునో మనకుఁ దెలియదు" అని పలికెను. అహమ్మదుషా చిఱునగవుతోను, వినయముతోను బ్రత్యుత్తరమిచ్చుచుండెను. అతఁడు తనభార్యయం దత్యంత ప్రేమగలవాఁడగుటచే, ఆసుందరీ రత్నముయొక్క మాటలను, క్రియలనుగూడ నతనికి మరింతసంతోషము నిచ్చుచుండెను. అతనికన్నులకు ఆలలనామణి లావణ్యపుగనిగాఁ గనఁబడుచుండెను. ఆభవనములోని వందిమాగధులును, చెలువుచుట్టును గుంపులుగుంపులుగాగూడిన ప్రజలును, పాదుషాబట్టలమీఁద మంటలవంటి వజ్రపు కాంతులను జూచి ఆశ్చర్యపడుచుండిరి. సూర్యకిరణములచే నాకాంతులును మంటలవలెనే తోఁచుచుండెను. ఇట్లుండ నకస్మాత్తుగా నొకజ్వాల అతని కుడిభుజముపైఁ గనఁబడఁజొచ్చెను. అందఱు నాశ్చర్యముతోఁ జూడఁజొచ్చిరి. వారు తమకన్నులను దామే నమ్మలేకుండిరి. ఆలాలాలలనామణిఆపాదుషాదుస్తులపైఁ బూసినవిషధీరసముపై సూర్యకిరణములు పనిచేయ మొదలిడెను. అహమ్మదుషా యుద్ధమున వీరుఁడేకాని తాను వలచినవనితచే భయంకర మృత్యుముఖమునఁ ద్రోయఁబడినప్పుడు, అతఁడు సాధారణ మానవులతో సమానుఁడయ్యెను. శరీరమునుండి మండుచున్న విషపుబట్టలను తీసివేయుటకుఁ బ్రయత్నించుచు, అటునిటు పరుగెత్తుచు, బాధ కోర్వలేక కేకలు వేయసాగెను. అతనిని బాధ చాలకాలము పీడించలేదు. మంట లతనిశరీరమంతటను భీకరముగా నలముకొనెను,

నిమిషములో గరిష్ఠుఁడగు పాదుషాయును, అతని దివ్యాంబరాభరణములును భయంకరమైన భస్మరాశి యయ్యెను. ఇంతలో ఆలాఁలాలలనామణి కోటగోడపై కెక్కి దుఃఖముతోను, సంతోషముతోను, పెండ్లికుమారునిఁజూచుచు, తన భ్రాతృపితృమరణమునకు, దనవంశనాశనమునకు దగినట్లు కసిదీర్చుకొంటినను సంతృప్తితో



ఆ రజతకాసారపు లోఁతునీళ్లలోఁ దల్లక్రిందుగాఁబడి కీర్తిశేషురాలయ్యెను.

---

# రాగతనము

సందూరి వెంకట సుబ్బారావు గారు, బి. ఏ.

కొమ్మలో కోకిల 'కో' యంటదే
రాగతనమోయేమొ బాగుహోగెరుగదే!

యెంకి దూరానుండె,
యేటి దరి నేనుంటి,
"సావాస మింకెవరో
సందడెవరో" నంటి
కొమ్మలో కోకిల 'కో'యంటదే.

పూలెరుగు నాకోడ!
నీలెరుగు నామోడ!
"మనుగడల కెవరితో
మనుసు కలిపే" దంటి
కొమ్మలో కోకిల 'కో'యంటదే.

యేటికడుపున దాగి
తోట నిదరోయింది
"ఆలనా నాసాదకు
పాలనా" యనుకొంటి
కొమ్మలో కోకిల 'కో'యంటదే.

తరిమి తరిమేశాను
తిరిగి "కో" "కో" యంది
ఆడించె ఆటగా,
పాడించె పాటగా!
కొమ్మలో కోకిల "కో"యంటదే
రాగతనమోయేమొ బాగుహోగెరుగదే.